స్కామ్‌ల పార్టీ కాంగ్రెస్..

స్కీమ్‌ల పార్టీ బీఆర్‌ఎస్

- జవహర్‌నగర్‌లో గ్రేటర్ వాసులకు డబుల్ ఇళ్లు
- ముషీరాబాద్‌కు 500, సికింద్రాబాద్‌కు 500 చొప్పున..
- అర్హులైన పేదలకు నీడ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి


జవహర్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి


జవహర్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను అన్ని వసతులతో కట్టించి పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముషీరాబాద్, సికింద్రాబాద్ నియోజక వర్గాలకు చెందిన ప్రజలకు వెయ్యి డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ 50 ఏళ్ల పరిపాలన చేసిన కాంగ్రెస్ పార్టీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆ పార్టీ స్కాంల పార్టీ అని, బీఆర్‌ఎస్ స్కీంల పార్టీ అన్నారు. సీఎం కేసీఆర్ నిరుపేదల కోసం ఎన్నో గొప్ప పథకాలను ప్రవేశపెట్టిన మహాత్ముడని కొనియాడారు. దేశంలో ఇలాంటి ఇళ్లు ఎక్కడా ఏ పార్టీ వాళ్లు నిర్మించి ఇవ్వలేదని పారదర్శకతతో ర్యాండమైజేషన్ పద్ధతిలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయిస్తున్నామన్నారు. మిగతా వారికి మూడో, నాలుగో దశలో ఇళ్లను కేటాయిస్తామన్నారు. ఇళ్లు రానివాళ్లు ఎలాంటి ఆందోళన చెందవద్దని, దరఖాస్తు చేసుకున్న వారందరికీ తప్పకుండా ఇళ్లు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, దమ్మాయిగూడ చైర్‌పర్సన్ ప్రణీతగౌడ్, మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి కృష్ణారెడ్డి, ఆర్డీవో రాజేష్‌కుమార్, కాప్రా తహసీల్దార్ మతీన్, జవహర్‌నగర్ కమిషనర్ రామలింగంతో పాటు జవహర్‌నగర్ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కళ్లలో వెలుగులు నింపిన కేసీఆర్


ప్రతాపసింగారంలో ఇళ్ల పట్టా అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు తదితరులు

ఘట్‌కేసర్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందజేసి పేదల కళ్లలో వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని డిప్యూటీ స్పీకర్ పద్మారావు అన్నారు. ప్రతాపసింగారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, సర్పంచ్ శివశంకర్‌తో కలిసి 500 మందికి గురువారం డబుల్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ప్రతాపసింగారంలో నిర్మించిన రెండు పడకల ఇళ్లను స్థానికులకు కేటాయించాలని సర్పంచ్ శివశంకర్ డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను కోరారు. కార్యక్రమంలో జోనల్ అధికారి సైదులు, తహసీల్దార్ కృష్ణ, ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, హౌసింగ్ డీఈ సిద్దార్థ, ఎంపీఓ నందకిశోర్, ఆర్.అలేఖ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల కేటాయింపు.. భారీ బందోబస్తు..


జవహర్‌నగర్‌లో పోలీసుల బందోబస్తు


జవహర్‌నగర్‌లో శ్రీకాంత్‌యాదవ్ తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు


జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

జవహర్‌నగర్: భారీ పోలీస్ బందోబస్తు మధ్య జవహర్‌నగర్‌లో గురువారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాల పంపిణీ కొనసాగింది. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సికింద్రాబాద్, ముషీరాబాద్ ప్రాంతాలకు చెందిన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించడంపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసి అడ్డుకుంటామని హెచ్చరించడంతో బుధవారం అర్ధరాత్రి నుంచే జవహర్‌నగర్ పోలీసులు అడుగడుగునా కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. గురువారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల స్థలాల వద్దకు వచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్‌తో పాటు పలువురు నాయకులను పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ పొట్టకూటి కోసం ఎంతో మంది వలస వచ్చి జవహర్‌నగర్‌లో కిరాయి ఇళ్లలో నివాసముంటూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే.. వారికి ఇళ్లను కేటాయించకుండా ఎక్కడో నగరంలో ఉన్న వారికి కేటాయించి స్థానిక ప్రజాప్రతినిధులతో మంత్రి మల్లారెడ్డి పట్టాలు పంపిణీ చేయడం విచారకరం అన్నారు. పోలీసు బందోబస్తు మధ్య పట్టాలు పంపిణీ చేయడం కాదు.. దమ్ముంటే ఒంటరిగా జవహర్‌నగర్‌కు వస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్ల శ్రీనివాస్, వినయ్‌కుమార్, ధనమ్మ, లత, సరిత, కన్నెమైన రాజుయాదవ్, కొయ్యడ అజయ్, సోమేష్‌చారి, మిట్టు తదితరులు పాల్గొన్నారు.

వారికి నచ్చిన వారి పేర్ల నమోదు..

గృహలక్ష్మి పథకం బీఆర్‌ఎస్ నాయకులు, కార్పొరేటర్లకు ఏటీఎంలా మారిందని విమర్శించారు. దరఖాస్తులు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని, లోపల మాత్రం అధికారులను బెదిరిస్తూ వారికి ఇష్టం వచ్చిన వారి పేర్లను నమోదు చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో వాటిని బయట పెడతామని కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రేపు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ఘట్‌కేసర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని గురుకుల్ క్రీడా మైదానంలో మేడ్చల్ జిల్లాస్థాయి కబడ్డీ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జోనల్ సెక్రటరీ శ్రీరాములు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు బోనాఫైడ్, ఆధార్ కార్డు, ఎలిజిబులిటీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

సెయింట్ క్లారెట్ స్కూల్‌పై చర్యలకు డిమాండ్

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలోని సెయింట్ క్లారెట్ స్కూల్ యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు అరుణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులు, విద్యార్థులను ఫీజుల కోసం ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. పిల్లలను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తూ చదువులకు దూరం చేస్తున్నారని, ఫీజుల కోసం జులూం చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

ఘట్‌కేసర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సిమ్మింగ్ పోటీలో పాల్గొనేందుకు జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడల కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. పోటీలో పాల్గొనేవారు అండర్‌–14, అండర్‌–17 బాలబాలికలు 26న ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటలలోపు వివరాలు అందజేయాలని, 27న ఉదయం 8 గంటలకు రిపోర్ట్ చేయాలని కోరారు. క్రీడాకారులు అర్హత ఫామ్‌తో పాటు బోనాఫైడ్, ఆధార్ కార్డు, పోయిన ఏడాది ప్రోగ్రెస్ కార్డు, ప్రిన్సిపల్ సంతకంతో పాటు స్టాంప్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వివరాలకు ఫోన్: 83281 09810.

తపాలాశాఖ మెరుగైన సేవలు



మేడ్చల్: దేశ ప్రజలకు తపాలా శాఖ నాణ్యమైన సేవలను అందిస్తోందని, వాటిని ప్రజలు వినియోగించుకోవాలని తెలంగాణ సర్కిల్ తపాలా శాఖ సీపీఎంటీ ఐపీఓ కె.ప్రకాష్, సికింద్రాబాద్ డివిజన్ ఐపీఓ ఎస్‌ఎస్‌పీఓ వై.నరేష్‌లు అన్నారు. మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన తపాలా సేవల అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు ఏళ్లుగా తపాలా శాఖ సేవలు అందిస్తోందని అన్నారు. ఎన్నో సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానందరెడ్డి, కౌన్సిలర్లు మానస శ్రవణ్‌కుమార్‌గుప్తా, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహస్వామి యాదవ్, కౌడె మహేష్, ఎంపీడీఓ పద్మావతి, డిప్యూటీ సీఈఓ సరిత, తపాల శాఖా అధికారులు శ్రీనివాసు, వెంకన్న, దండప్ప, మేమవాణి, నర్సింలు, రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

చదువు, క్రీడలూ రెండూ ముఖ్యమే..



కీసర: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చదువులతో పాటు క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఉందని జెడ్పీ వైస్‌చైర్మన్ బెస్త వెంకటేష్ అన్నారు. గురువారం భోగారంలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో ఉమ్మడి రంగారెడ్డి(మేడ్చల్, రంగారెడ్డి, కొండగల్, వికారాబాద్) జిల్లా పరిధిలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలకు చెందిన జిల్లాస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా తీసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. సర్పంచ్ సుంకరి కవితాజైహింద్‌రెడ్డి, రైతు కన్వీనర్ పడమటి నర్సింహరెడ్డి, భోగారం కో ఆప్షన్ సభ్యుడు దబ్బి నర్సింహరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు హేమలత, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గన్నేర్ల సత్యనారాయణ, భోగారం సీనియర్ నాయకులు జైహింద్‌రెడ్డి, టీచర్స్ పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం


మేడ్చల్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి


మేడ్చల్‌లో సంప్రద ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 13వ వార్డులో రూ.20 లక్షలతో చేపడుతున్న సీసీ, రోడ్డు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు మంత్రి మల్లారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, నాయకులు దయానంద్‌యాదవ్, నవీన్‌రెడ్డి, కౌన్సిలర్లు మహేష్, నర్సింహస్వామి యాదవ్, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి..

ప్రజలకు నాణ్యమైన సేవలను వైద్యులు అందించాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సంప్రద ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి, వారు త్వరగా కోలుకునే విధంగా చికిత్సలు అందించాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో లాభాపేక్ష లేకుండా సేవాభావంతో సేవలు అందించాలని కోరారు. సంప్రద ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ సందీప్ పిన్నింటి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రకాష్, స్థానిక నాయకులు, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు


మేడ్చల్ పోలీసుల అదుపులో కాంగ్రెస్ నాయకులు


ఘట్‌కేసర్‌లో బీజేపీ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

మేడ్చల్‌రూరల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ సందర్భంగా మంత్రి కేటీఆర్ పర్యటన ఉండటంతో మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ సందర్భంగా కాంగ్రెస్ నిరసనకు పిలుపునివ్వడంతో ఈ మేరకు పోలీసులు ఉదయాన్నే మండల నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మేడ్చల్ మండలంలోని పేదలకు ఇళ్లు అందించలేని ప్రభుత్వం ఎందుకని పార్టీ మండల నాయకులు అన్నారు. పక్క నియోజకవర్గంలో కార్యక్రమం ఉంటే మేడ్చల్‌లో తమను అదుపులోకి తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటే భయం ఏర్పడిందని, అందుకే నిర్బంధాలు చేస్తున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు రవిముదిరాజ్, సంజీవరావు, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

ఘట్‌కేసర్: ప్రతాపసింగారంలో నిర్మించిన రెండు పడకల ఇళ్లను స్థానికులకు కేటాయించిన తర్వాత స్థానికేతరులకు పంపిణీ చేయాలని గతంలో డిమాండ్ చేసిన ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, బీజేవైఎం నాయకులు శివ, శ్రీకాంత్, వీరారెడ్డిని ఘట్‌కేసర్ పోలీసులు గురువారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేశారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ


జవహర్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జవహర్‌నగర్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తక్షణమే పెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివ ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రధాన రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ హాజరై మాట్లాడుతూ.. చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టిన కేంద్ర ప్రభుత్వం 30 ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నా ఎస్సీ వర్గీకరణ బిల్లును ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ రాష్ట్ర సాధన తరహాలో ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి రాంచందర్, నాయకులు ప్రణయ్‌కుమార్, కొయ్యడ వెంకటేష్, యాకస్వామి, ఆనంద్, యాదగిరి, ప్రభాకర్, సురేందర్, అంజన్న, లక్ష్మయ్య, నర్సింహ, మల్లేష్, రవి, మహేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నిధుల గోల్‌మాల్‌పై వినతి




ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పురపాలక సంఘంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని పురపాలక పరిపాలన శాఖ కమిషనర్ పమేలా సత్పతికి మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య గురువారం వినతి పత్రం అందజేశారు. నిధుల గోల్‌మాల్‌కు కారకులైన కమిషనర్లు, మేనేజర్లు, అందులో సంబంధమున్న బిల్ కలెక్టర్లపై కూడా చర్యలు తీసుకోవాలని లేఖలో కోరింది. పంచాయతీగా ఉన్న సమయంలో బిల్ కలెక్టర్లపై అభియోగాలు రాగా అప్పటి కలెక్టర్ వారిని విధుల నుంచి తొలగించారని, కోర్టు ఆదేశాల ద్వారా వారు తిరిగి విధుల్లో చేరారని గుర్తు చేశారు. నిధుల దుర్వినియోగంలో పాల్పంచుకున్న అందరిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

దోభీఘాట్‌కు స్థలం కేటాయించాలని వినతి



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో దోభీఘాట్ ఏర్పాటు స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని కోరుతూ గురువారం రజకులు మంత్రి మల్లారెడ్డిని వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి మంత్రిని కలిసి రజకులు కులవృత్తి చేసుకునేందుకు దోబీఘాట్ ఎంతో అవసరమని వివరించారు. దోబీఘాట్‌కు స్థలం కేటాయించి నిర్మించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కులవృత్తుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. వెంటనే స్థలం కేటాయించి దోబీఘాట్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, పెంటయ్య, జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, బాలరాజు, బీఆర్‌ఎస్ నాయకులు సురేందర్‌గౌడ్, రజక సంఘం నాయకులు మలిగె అశోక్, నాగేశ్, శ్రీకాంత్, శంకర్, శివమణి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు షురూ



మేడ్చల్: పట్టణంలోని 14వ వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులను వార్డు కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. వార్డులోని రోడ్ నంబర్‌–5, 6లలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు పూజలు చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. వార్డు నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగారంలో అభివృద్ధి పనులకు రూ.1.31 కోట్లు


నాగారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో రూ.1.31 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశాన్ని గురువారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో కౌన్సిలర్ల సహకారంతో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. పార్టీలకతీతంగా కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువస్తున్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నట్లు చెప్పారు. సమావేశంలో కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, డీఈఈ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన


గర్భిణులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ

మేడ్చల్‌రూరల్: జాతీయ పోషణ మాస సంబరాల్లో భాగంగా మండలంలోని రావల్‌కోల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేడ్చల్ ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ, ఎంపీడీఓ పద్మావతి, వైస్ ఎంపీపీ వెంకటేశ్ పాల్గొని గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మహిళా సాధికారిత బృందం ఆధ్వర్యంలో భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమం నిర్వహించి బాలికల చదువుపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్, నాయకులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకంలో పేదలకు అన్యాయం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు, నాయకులు

శామీర్‌పేట్: గృహలక్ష్మి పథకంలో అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడు నర్సింహులుయాదవ్ అన్నారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి కాకుండా బీఆర్‌ఎస్ నాయకులకే కేటాయించారని మహిళలు గురువారం మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. అర్హులకు కాకుండా అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన వారికే గృహలక్ష్మి అందుతుందని ఆరోపించారు. అర్హులకు గృహలక్ష్మి ఎందుకు కేటాయించలేదని తహసీల్దార్ వాణిరెడ్డిని మహిళలు ప్రశ్నించారు. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన చేస్తున్న మహిళలను అక్కడి నుంచి పంపించారు. కార్యక్రమంలో మూడుచింతలపల్లి ఉపసర్పంచ్ వెంకటరమణారెడ్డి, వార్డుసభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు నర్సింహులు, భూపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు వెంకటేష్, రాజు, సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రీడలు అవసరం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీసీ గురుకుల సొసైటీ డిప్యూటీ సెక్రెటరీ ఇందిర

శామీర్‌పేట్: విద్యార్థి దశలో క్రీడలు అవసరమేనని బీసీ గురుకుల సొసైటీ డిప్యూటీ సెక్రెటరీ ఇందిర అన్నారు. శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని గురుకుల పాఠశాలలో హైదరాబాద్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, కుంగిపోకుండా వాటిలోని స్ఫూర్తిని గ్రహించి మరింత ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని విద్యార్థులకు వారు సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఆర్‌సీఓ ఆదిత్యవర్మ, ప్రిన్సిపల్ ఉషారాణి, సాయిచంద్, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.